

ఉమ్మడిగా.. సై

ఎన్నికల బరిలో నిలిచేది ఎవరు.. ఎవరికి టిక్కెట్ ఇస్తారు.. వైసీపీ ఫేక్ ప్రచారం.. పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ.. తదితరాలన్నింటికీ తెరపడింది. ఎన్నికల బరిలో ఉండేదెవరో స్పష్టత వచ్చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు శనివారం టీడీపీ, జనసేన అధినేతలు సంయుక్తంగా ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. సిట్టింగ్‌లకు.. సీనియర్లకు.. సమర్థతకు.. విధేయతకు తొలిజాబితాలో పెద్ద పీట వేశారు. ప్రతి ఎన్నికల్లోనూ చివరి నిమిషాన పేరు ప్రకటించే సంప్రదాయానికి భిన్నంగా చంద్రబాబు ఈ సారి 52 రోజుల ముందే అభ్యర్థి ఎవరో తేల్చేయడం గమనార్హం. పొత్తు నేపథ్యంలో జనసేన ప్రకటించిన జాబితాలో తెనాలి ఉండగా ఇక్కడి నుంచి ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాదెండ్ల మనోహర్‌కు అవకాశం దక్కింది. రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్ల ప్రకటనతో ఇరు పార్టీల శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూ, ప్రదర్శనలు నిర్వహిస్తూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల్లో సత్తా చూపి విజయభావుటా ఎగరవేసి అధినేతలకు గిఫ్ట్ అందజేస్తామని అభ్యర్థులు ప్రకటించారు.

- టీడీపీ, జనసేన తొలి జాబితా విడుదల
- పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు.. సంబరాలు
- తెనాలి నుంచి జనసేన అభ్యర్థిగా మనోహర్ పేరు ఖరారు
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 14 స్థానాల్లో అభ్యర్థుల ఖరారు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సీనియర్లకు మరో అవకాశం
- బాపట్ల జిల్లాలో మూడు చోట్ల సిట్టింగ్‌లకే తిరిగి అవకాశం
- బాపట్ల నుంచి వేగేశన, ప్రత్తిపాడు నుంచి రామాంజనేయులు తొలి సారి పోటీ

(గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, తెనాలి, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన పార్టీల తరఫున శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితా విడుదలతో ఉత్కంఠకు తెరపడింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆరుగురి మినహా మిగిలిన అన్ని స్థానాలకు అభ్యర్థులను ఒకేసారి ప్రకటించారు. దీంతో ఇరు పార్టీల శ్రేణులు ఆనందోత్సాహాలలో మునిగి తేలారు. అభ్యర్థులు సైతం ఇకపై మరింతగా ప్రజలతో మమేకమయ్యేందుకు కార్యాచరణకు సిద్ధమయ్యారు. జిల్లాలో వైసీపీ ఖాతా తెరవకుండా ఉండడమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉండనున్నదని అభ్యర్థులు ప్రకటించారు. తొలి జాబితాలో పల్నాడు జిల్లా పరిధిలోని నాలుగు స్థానాలకు, బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల మినహా మిగిలిన ఐదు స్థానాలకు, గుంటూరు జిల్లా పరిధిలోని ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. వైసీపీలో అభ్యర్థుల ఎంపికపై గందరగోళం నెలకొనగా టీడీపీ ముందంజలో ఉంది. ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించి టీడీపీ, వైసీపీకి సవాల్ విసిరింది. తొలి జాబితాలో సీటు ఖరారైన వారిలో మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబులు ఉన్నారు. బాపట్ల జిల్లాలో రేపల్లె, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకే అవకాశం కల్పించారు. బాపట్ల నుంచి వేగేశన నరేంద్రవర్మ, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నుంచి విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పార్టీ అభ్యర్థుల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీలతో పాటు బాణసంచా కాల్చి ఆనందోత్సాహాలను వ్యక్తం చేశాయి. అభ్యర్థులను నేతలు, కార్యకర్తలు కలిసి సత్కరించారు. నేతలకు శుభాకాంక్షలు చెప్పడానికి శ్రేణులు పార్టీ కార్యాలయాల్లో బారులు తీరారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని అటు టీడీపీ, ఇటు జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రకటించారు.

నాలుగోసారి జీవీ





టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులుకు వినుకొండ నుంచి పోటీకి నాలుగో సారి అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. ఆయన వినుకొండ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన జీవీ వరుసగా నాలుగోసారి వినుకొండ బరిలో దిగుతున్నారు. టీడీపీ ఆవిర్భావం అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇక్కడ మూడు సార్లు పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. టీడీపీ పొత్తులో సీపీఐ రెండు సార్లు విజయం సాధించింది. మొదటి నుంచి టీడీపీకి వినుకొండ బలమైన నియోజకవర్గం.

సత్తెనపల్లి నుంచి కన్నా



సత్తెనపల్లి నుంచి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. గతంలో నాలుగుసార్లు పెదకూరపాడు నుంచి, గుంటూరు పశ్చిమ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందిన కన్నా టీడీపీ అభ్యర్థిగా తొలి సారి సత్తెనపల్లి బరిలో దిగుతున్నారు. 1989లో మొట్టమొదటి సారిగా పెదకూరపాడు అసెంబ్లీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1994, 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2009లో గుంటూరు పశ్చిమ నుంచి విజయం సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్య, ఎన్ కిరణ్ కుమార్‌రెడ్డిల మంత్రి వర్గాల్లో పలు మంత్రి పదవులు నిర్వహించారు. కాగా 2024 ఫిబ్రవరి 24న ఆయనను సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు.

పుల్లారావు ఆరోసారి



చిలకలూరిపేట నుంచి వరుసగా ఆరోసారి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పోటీ చేస్తున్నారు. గతంలో ఐదు సార్లు పోటీ చేయగా మూడు సార్లు విజయం సాధించారు. 1983 నుంచి జరిగిన ఎన్నికల్లో 1983, 1989, 1999, 2009, 2014, ఎన్నికల్లో టీడీపీ ఇక్కడ విజయం సాధించింది.

బ్రహ్మారెడ్డి మూడోసారి..



మాచర్ల టీడీపీ అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఉన్నత విద్య చదివిన బ్రహ్మారెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇది మూడోసారి. వారి తల్లి దండ్రులు నాల్గుసార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. గతంలో 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. 1999లో బ్రహ్మారెడ్డి తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మాచర్లలో అరాచకాలను అడ్డుకుంటూ పార్టీ క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేశారు. 2021 డిసెంబరు 22న బ్రహ్మారెడ్డిని మాచర్ల ఇన్‌చార్జిగా చంద్రబాబు నియమించారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం, ధైర్యం నెలకొంది. ఏదైనా జరిగితే బ్రహ్మారెడ్డి వస్తాడనే భావం ఆ పార్టీ నేతల్లో ఉంది.

పల్నాడు జిల్లా..

సత్తెనపల్లి	కన్నా లక్ష్మీనారాయణ
చిలకలూరిపేట	ప్రత్తిపాటి పుల్లారావు
వినుకొండ	జీవీ ఆంజనేయులు
మాచర్ల	జూలకంటి బ్రహ్మారెడ్డి



ఆనందబాబు నాలుగో సారి..



వేమూరు అభ్యర్థిగా బరిలో ఉండనున్న మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు రాజకీయాల్లో అంచలంచలుగా ఎదిగారు. కొల్లిపర మండలం సిరిపురంలో జన్మించిన ఆయన గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తదుపరి బీఏ పూర్తి చేసి, ఆంధ్ర యూనివర్సిటీలో బీఎల్ పట్టా పొందారు. రాజకీయాలపై ఆసక్తితో 1987-88లలో గుంటూరు జిల్లా తెలుగు విద్యార్థి అధ్యక్షుడిగా ఐదేళ్లు తర్వాత ఆర్గనైజింగ్ సెక్రటరిగా, పార్టీ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 2009లో తొలిసారి వేమూరు నుంచి గెలుపొందారు. 2014లో రెండోసారి విజయం సాధించి మంత్రిగా కూడా పనిచేశారు. 2019లో ఓటమి పాలయ్యారు. మరలా ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా వేమూరు నుంచి బరిలో దిగనున్నారు.

గొట్టిపాటి ఐదో సారి



అద్దంకి నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు గెలు పొంది ఓటమెరుగని నేతగా గొట్టిపాటి రవికుమార్ కీర్తి గడించారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రవికుమార్‌కే మరో సారి టీడీపీ నుంచి పోటీ చేసే అవకాశం వచ్చింది. 2004లో మార్టూరు నుంచి కాం గ్రెస్ తరపున గెలుపొందగా, 2009లో అద్దంకి నుంచి అదే పార్టీలో బరిలో ఉండి విజయం సాధించారు. 2014లో వైసీపీ తరపున గెలిచి హ్యాట్రిక్ విజయం నమోదు చేశారు. 2019లో టీడీపీ తరపున గెలుపొందారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న రవికుమార్ రాబోయే ఎన్నికలలో మరోమారు బరిలో నిలిచారు.

హ్యాట్రిక్‌పై ఏలూరి కన్ను




పర్చూరు ఎమ్మెల్యేగా 2014, 2019లో టీడీపీ తరపున గెలుపొందిన ఏలూరి సాంబశివరావు 2024లో కూడా బరిలో ఉండనున్నారు. ఈ ఎన్నికల్లో కూడా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. 2019లో ఎన్టీఆర్ అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావుపై గెలుపు బావుటా ఎగురవేశారు. మార్టూరు మండలం కోనంకిలో జన్మించిన ఆయన హార్టికల్చర్ విభాగంలో మాస్టర్ డిగ్రీ పొందారు. అనంతరం అదే విభాగంలో ప్రభుత్వ ఉద్యోగిగా కూడా సేవలందించారు. ప్రస్తుతం పర్చూరు ఎమ్మెల్యేగా ఉండడంతో పాటు బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు.

హ్యాట్రిక్ లక్ష్యంలో అనగాని



రేపల్లె టీడీపీ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ నాలుగోసారి బరిలో ఉండనున్నారు. ఆయన బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశారు. 2009లో టీడీపీ తరపున పోటీ చేసిన ఆయన మోపిదేవి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత వరుసగా 2014, 2019లలో టీడీపీ తరపున విజయం సాధించిన ఆయన ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంతో ఉన్నారు. రాజకీయంగా కుటుంబ నేపథ్యం ఉం డడంతో పాటు నియోజకవర్గంలో సేవలందించడంలో తనదైన మార్కు చూపించారు. అంతేకాకుండా టీడీపీ అధినేతతో సన్నిహిత అనుబంధం ఉన్న అతి కొద్దిమందిలో అనగాని ఒక్కడిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

ఎన్నికల బరిలో వేగేశన



బాపట్ల టీడీపీ అభ్యర్థిగా ఖరారైన వేగేశన నరేంద్ర వర్మ.. వ్యాపార రంగంలో విజయం సాధించి వేగేశన ఫౌండేషన్ పేరిట సేవలందిస్తూ రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. 2009 నుంచి టీడీపీలో క్రియాశీలకంగా ఉంటున్నప్పటికీ తొలిసారి ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పార్టీకి విధేయుడన్న గుర్తింపే ఆయనకు బాపట్లలో పోటీచేసే అవకాశం వచ్చింది.

బాపట్ల జిల్లా

పర్చూరు	ఏలూరి సాంబశివరావు
బాపట్ల	వేగేశన నరేంద్రవర్మ
వేమూరు	నక్కా ఆనందబాబు
రేపల్లె	అనగాని సత్యప్రసాద్
అద్దంకి	గొట్టిపాటి రవికుమార్

రెండో సారి లోకేశ్..



మంగళగిరి నుంచి యువ నేత నారా లోకేశ్ రెండో పర్యాయం బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచి పోటీ చేసి ఓటమి చెందినా నియోజకవర్గాన్ని వీడకుండా పార్టీ శ్రేణులకు అండగా ఉన్నారు. ఈ ఐదేళ్ళలో ప్రతిఒక్కరికీ ఏదో ఒక రూపంలో ఆయన సాయమందిస్తూ వచ్చారు. లాంఛనంగా ఆయన పేరు తాజాగా ప్రకటించినప్పటికీ ఎప్పటి నుంచో ఆయన తన విజయానికి బాటలు వేసుకుంటూ వస్తున్నారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి గ్రూపు విబేధాలు మూలంగా గెలుపు అవకాశాల్లేవని, ఆయన్ని తప్పించి గంజి చిరంజీవిని బరిలోకి దించిన విషయం తెలిసిందే. దీంతో ఆళ్ల వైసీపీకి రాజీనామా చేశారు. అయితే ఇక్కడ ఎవరికి టిక్కెట్ ఇచ్చినా ఆళ్ల వ్యతిరేకంగా చేస్తే గెలుపు అసాధ్యమని భావించిన వైసీపీ అధిష్ఠానం తిరిగి ఆయన్ను బుజ్జగించి పార్టీలోకి చేర్చుకున్నది.

నాలుగో సారి శ్రావణ్‌కుమార్



ఎస్సీ నియోజకవర్గమైన తాడికొండ నుంచి మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ నాలుగో సారి రంగంలోకి దిగుతున్నారు. ప్రస్తుతం ఆయన కొత్తగా ఏర్పడిన గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. 2009లో మొదటిసారి ఎన్నికల బరిలోకి దిగిన శ్రావణ్‌కుమార్ డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతిలో ఓటమి చెందారు. తిరిగి 2014లో అదే నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు. తుళ్ళూరు ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించటంతో ఆయన రాజధాని ప్రాంత ఎమ్మెల్యేగా కీలక పాత్ర పోషించారు. తిరిగి 2019లో బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. అయినా ఆయన నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు అండగా నిలవడమే కాకుండా అమరావతి రైతుల ఉద్యమానికి అండగా నిలిచారు.

ఏడో సారి నరేంద్ర



పొన్నూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేరును ప్రకటించారు. అదే నియోజకవర్గం నుంచి ఆయన ఏడో పర్యాయం ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో స్వల్ప మెజార్టీతో ఆయన ఓటమి పాలై డబుల్ హ్యాట్రిక్‌ను మిస్ అయ్యారు. ఈ ఐదేళ్లు ఆయన ప్రభుత్వంపై పార్టీ పరంగా పోరాటం చేయటమే కాకుండా వ్యక్తిగతంగా కూడా తాడేపల్లి ప్యాలెస్‌ను ఢీ కొనాల్సి వచ్చింది. దీంతో వ్యక్తిగతంగా కక్ష కట్టి సంగం డెయిరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయన్ను అకారణంగా జైలు పాలు కూడా చేశారు. న్యాయ పోరాటం ద్వారా వైసీపీ ప్రభుత్వాన్ని ఢీ కొనటమే కాకుండా డెయిరీ వారి బారిన పడకుండా నరేంద్ర కాపాడుకున్నారు.

ఐదో సారి నాదెండ్ల



మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు తనయుడైన నాదెండ్ల మనోహర్ జనసేన కోటాలో తెనాలి సీటును దక్కించుకున్నారు. గతంలో మూడు పర్యాయాలు కాంగ్రెస్ తరపున ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మనోహర్ 2004, 2009లో వరుస విజయాలు చవిచూశారు. స్పీకర్‌గా కూడా పనిచేసే అవకాశం దక్కింది. ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున 2014 లో బరిలోకి దిగి పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత జనసేనలో చేరి 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రస్తుతం ఆ పార్టీ రాజకీయాల వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా కీలకపాత్ర వహిస్తున్నారు. అయితే 2019 ఎన్నికల్లో ఓడిపోయినా నియోజకవర్గాన్నే అంటిపెట్టుకుని ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేస్తూ జనసేనతో పొత్తును స్వాగతించిన ఆలపాటికి ఈసారి నిరాశ ఎదురైంది.

ప్రత్తిపాడు నుంచి విశ్రాంత ఐఏఎస్



ఎస్సీ నియోజకవర్గమైన ప్రత్తి పాడు నుంచి విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు పేరును ప్రకటించారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసి పరాజయం చెందిన స్థానికుడైన కందుకూరి వీరయ్యకు ఈ పర్యాయం సీటు ఇవ్వాలని జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలు ప్రయత్నించినా చంద్రబాబు రామాంజనేయులు వైపే మొగ్గారు. కొన్నేళ్ళుగా రాష్ట్ర కార్యాలయంలో ఉండి ఐటీ వింగ్ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రామాంజనేయులుకు అది ప్లస్ పాయింట్‌గా మారింది. కొందరు ఐఏఎస్‌లకు అవకాశం కల్పించాలన్న చంద్రబాబు నిర్ణ యంతో రామాంజనేయులు పేరు ఖరారైంది. ఈయన గతంలో గుంటూరు కలెక్టర్‌గా పనిచేశారు.

జంగా సీటుతో యరపతినేనికి లింకు





గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేరు మొదటి జాబితాలోనే తప్పనిసరిగా ఉంటుందని ఆయన అభిమానులు భావించారు. వైసీపీ ప్రభుత్వంపై పోరాటం చేస్తూ పార్టీ శ్రేణులకు అండగా నిలిచిన యరపతినేనికి సీటు ఖాయమే అయినప్పటికీ కొన్ని కారణాల దృష్ట్యా అధికారికంగా ప్రకటించలేదు. నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా అనీల్ కుమార్ వలస రావడంతో సామాజిక సమీకరణల సమస్య టీడీపీకి ఎదురైంది. నరసరావుపేట పార్లమెంటు పరిధిలో ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీసీ అభ్యర్థిని బరిలోకి దించాలని చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న ఎమ్మెల్సీ జంగాకి తమ పార్టీ తరఫున బరిలోకి దించాలని టీడీపీ ఆలోచన. గతంలో రెండు సార్లు విజయం సాధించిన గురజాలనే ఆయన కోరుకోగా ఇచ్చే అవకాశం లేనందున జంగాకు ప్రత్యామ్నాయం చూసిన తర్వాతే యరపతినేని పేరు ప్రకటించా లని అధిష్ఠానం యోచన చేస్తున్నట్లు సమాచారం.

పెదకూరపాడుపై కసరత్తు

పల్నాడు, గుంటూరు లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ పెండింగ్ స్థానాలపై టీడీపీ కసరత్తు చేస్తోంది. పెదకూరపాడు ఇన్‌చార్జిగా డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ఉన్నారు. గత ఎన్నికల్లో పరాజయం పాలైనా నియోజకవర్గాన్ని వీడకుండా పార్టీ శ్రేణులకు ఆయన అన్ని విధాలుగా అండగా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ వీడిన ముఖ్య నేతలు తిరిగి శ్రీధర్ పక్షాన చేరి ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నారు. బయట వారిని తీసుకురావటానికి వీల్లేదని నేతలు, శ్రేణులు ఇటీవల గుంటూరులో సమావేశమై డిమాండ్ చేశారు.



గుంటూరు జిల్లా

మంగళగిరి	నారా లోకేశ్
తాడికొండ	తెనాలి శ్రావణ్‌కుమార్
ప్రత్తిపాడు	బూర్ల రామాంజనేయులు
పొన్నూరు	ధూళిపాళ్ల నరేంద్ర
తెనాలి	నాదెండ్ల మనోహర్

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చు
- జిల్లాలో 92 పరీక్షా కేంద్రాలు.. కేంద్రాల వద్ద 144 సెక్షన్
- 8.30 గంటలకే కేంద్రాల్లోకి అనుమతి.. 9 గంటల తరువాత నోఎంట్రీ


మాట్లాడుతున్న జీకే జుబేర్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24: ఇంటర్ పరీక్షలకు జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేశామని, నెట్ నుంచి డౌన్‌లోడు చేసుకున్న హాల్‌టిక్కెట్లతో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించామని ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ వెల్లడించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఆర్ఐవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జుబేర్ మాట్లాడారు. మార్చి 1 నుంచి ప్రారంభం అయ్యే పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 27,605 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 31,830 మంది చొప్పున మొత్తం 59,435 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 92 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇందులో 19 కొత్త కేంద్రాలకు ఈ ఏడాది అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు, కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఇప్పటికే పోలీసు శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. పరీక్షల కోసం మొత్తం 1,750 మందికి ఇన్విజిలేషన్ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారని విద్యార్థులను ఉదయం 8.30 నుంచే కేంద్రాల్లోకి అనుతిస్తామని, 9 గంటలు దాటిన తరువాత కేంద్రాల్లోకి అనుతించమని స్పష్టం చేశారు. కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ వద్ద తప్ప ఏ ఒక్కరి వద్ద సెల్‌ఫోన్స్ ఉండకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈసీ సభ్యులు బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మంగళగిరి కోసం అంతా కలిసిరండి

మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ పిలుపు ● పలువురు తటస్థ ప్రముఖులతో యువనేత భేటీ ● కాజ గ్రామంలో పార్టీ కార్యాలయం ప్రారంభం


తాడేపల్లిలో పాస్టర్ న్యూమన్ కుటుంబ సభ్యులతో. తాడేపల్లిలో పఠాన్ అబ్బాస్ ఖాన్ కుటుంబ సభ్యులతో, మంగళగిరి పర్యటనలో భాగంగా దివ్యాంగులతో నారా లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 24: మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు తటస్థ ప్రముఖులను శనివారం రాత్రి ఆయన కలుసుకున్నారు. తొలుత తాడేపల్లి 8వ వార్డుకు చెందిన పాస్టర్ కోలా న్యూమన్ నివాసానికి వెళ్లగా కుటుంబ సభ్యులు లోకేశ్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. రాష్ట్ర వ్యాపితంగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూమన్ విజ్ఞప్తి చేశారు. లోకేశ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సమయంలో క్రిస్టియన్ మైనార్టీల సమస్యలను తాను స్వయంగా అధ్యయనం చేశానని చెప్పారు. పాస్టర్లకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు క్రిస్టియన్ మైనార్టీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం తాడేపల్లికి చెందిన పఠాన్ అబ్బాస్‌ఖాన్ ఇంటికి వెళ్లారు. గత ప్రభుత్వంలో దుల్హన్, రంజాన్ తోఫా వంటి పథకాలను అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని రద్దు చేసిందని గుర్తుచేశారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైనార్టీ సోదరులను కడుపులో పెట్టుకుని చూసుకుంటుందని, గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామని చెప్పారు. అనంతరం మంగళగిరిలో ప్రణవి ఆర్థో కేర్ సెంటరు అధినేత తోట శ్రీనివాస రాఘవను వారి నివాసంలో కలుసుకున్నారు. మంగళగిరి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నందుకు లోకేశ్ అభినందనలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్య సేవల కోసం ఎన్టీఆర్ ఆరోగ్య రథాలను ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో వైద్య సేవలను విస్తృతం చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. చివరిగా మంగళగిరికి చెందిన కొటికలపూడి శ్రీనివాసరావును కలుసుకున్నారు. శ్రీనివాసరావు సెంట్రల్ వాటర్ కమిషన్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించడమే కాక వివిధ రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించారు. మంగళగిరి సర్వతోముఖాభివృద్ధికి పెద్దల సలహాలు, సూచనలు అవసరమని, రాబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం కాజలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాజ గ్రామానికి చెందిన వైసీపీ నేత పల్లా వెంకటేశ్వరరావు, ఆయనతోపాటు 65 వైసీపీ కుటుంబాలో లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి లోకేశ్ పసుపు కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అరాచక పాలన నుంచి రాష్ట్రానికి త్వరలో విముక్తి

- 1530వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, ఫిబ్రవరి 24: వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రానికి త్వరలో విముక్తి కలుగుతుందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1530వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, ప్రజా రాజధాని అమరావతి గెలుస్తుందన్నారు. మూడు ముక్కలాటకి శాశ్వతంగా స్వస్తి చెబుదామని ఐదుకోట్ల మంది తెలుగు ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు. బాధల నుంచి విముక్తి కలగాలంటే విజన్ ఉన్న చంద్రబాబు నాయుడి లాంటి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఎప్పటికైనా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని స్పష్టం చేశారు. ఉన్నత న్యాయస్థానం తీర్పు కూడా ఇదే అంశాన్ని ధ్రువీకరించదన్నారు. న్యాయం ధర్మం భూములిచ్చిన తమ వైపు ఉందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో రైతు ఆందోళనలు కొనసాగాయి.

అక్రమ ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలి

- టీడీపీ, జనసేన శ్రేణులు


అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

కొల్లూరు, ఫిబ్రవరి 24: వైసీపీ నాయకులు చేస్తున్న ఇసుక దందా, అక్రమ తవ్వకాల మీద చర్యలు తీసుకోవాలని కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కొల్లూరు మండలం పెదలంకలో ఉన్న కృష్ణానదిలో జరిగే అక్రమ ఇసుక తవ్వకాలను మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు మాజీమంత్రి నక్కా ఆనందబాబు ఆదేశాల మేరకు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, మంత్రి నాగార్జున అవినీతి మత్తులో సంపాదనే ధ్యేయంగా ఇసుక అక్రమ తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మంత్రితో పాటు వైసీపీ నాయకులు భాగస్వామ్యం ఉండటం వల్ల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వేమూరు నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలించి ఇసుక మాఫియాపై వెంటనే తగుచర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన పార్టీల తరఫున డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్, ఎస్ఐలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త ఊసా రాజేష్, బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, బాపట్ల పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మొవ్వా శరత్‌చంద్ర, మండల జనసేన అధ్యక్షులు చలమయ్య నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళగిరిలో 180 కుటుంబాలు టీడీపీలో చేరిక

- కండువా కప్పి ఆహ్వానించిన నారా లోకేశ్


టీడీపీలో చేరిన కార్యకర్తలతో లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 24: మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతోంది. ఎన్నికల సమయానికి ఆ పార్టీలో ఎవరు వుంటారో.. ఎవరు వెళ్లిపోతారో తెలియని పరిస్థితి నెలకొంది. వైసీపీ మునిగిపోతున్న నావ అని గమనించిన పలువురు నేతలు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నారు. తాజాగా, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 180 కుటుంబాలు శనివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నాయి. ఉండవల్లిలోని నివాసంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి అభివృద్ధిని కాంక్షిస్తూ తమ వెంట వస్తున్న వారిని అభినందించారు. పార్టీలో కొత్తగా చేరిన వారిని ఇప్పటికే పనిచేస్తున్న నేతలు కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. తాడేపల్లి పట్టణానికి చెందిన పల్లెపోగు అరుణ్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, చింకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, 11వ వార్డుకు చెందిన 30 కుటుంబాలు, మంగళగిరి పట్టణానికి చెందిన అవ్వారు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, చిర్రావూరుకు చెందిన రెడ్డి విజయ్, మేడూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్లరాజు, తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు మంగళగిరి ఎయిమ్స్ జాతికి అంకితం

- వర్చువల్‌గా చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ

మంగళగిరి, ఫిబ్రవరి 24: దేశంలో కెల్లా అత్యుత్తమంగా రూపుదిద్దుకున్న మంగళగిరి ఎయిమ్స్ ఆదివారం జాతికి అంకితం కానున్నది. అత్యంత సువిశాలమైన ప్రాంతంలో పచ్చని కొండల నడుమ, ఆహ్లాదకరమైన గ్రీనరీ మధ్య సుందరంగా, విజయవాడ-గుంటూరు నగరాల నడుమ, నవ్యరాజధాని అమరావతికి అత్యంత చేరువగా మంగళగిరి ఎయిమ్స్ అత్యద్భుతంగా ఆవిష్కృతమైంది. ఇన్నీ అనుకూలతలతో కూడిన ఎయిమ్స్ దేశంలో మరెక్కడా లేవన్నది కేంద్ర వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల మాట. కేంద్ర ప్రభుత్వం మంగళగిరిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు. దీంతో పాటు 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన చేయనున్నారు. ఎయిమ్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ మధుబానందకర్ మాట్లాడుతూ ఆదివారం జరగనున్న కార్యక్రమంలో గవర్నరు ఎస్.అబ్దుల్‌నజీర్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సూఖ్ మాండవ్య, కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద జోషి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, గిరిజన వ్యవహారాల శాఖామంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ ఎవార్, కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హాజరుకానున్నారని తెలిపారు.

51 మంది ఎస్ఐలకు నియామక పత్రాలు



గుంటూరు, ఫిబ్రవరి 24: గుంటూరు రేంజ్ పరిధిలో గత సంవత్సరంలో జరిగిన పోలీసు నియామక ప్రక్రియలో ఎంపికైన 51 మంది ఎస్ఐ అభ్యర్థులకు శనివారం రేంజ్ ఐజీ పాలరాజు నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం వారందరినీ శిక్షణ నిమిత్తం అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి ఎంపిక చేశారు. దీంతో వారు శనివారం సాయంత్రం గుంటూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రత్యేక బస్సుల్లో అనంతపురానికి బయలు దేరి వెళ్ళారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

ల్యాబ్ టెక్నీషియన్‌ల

సమస్యలు పరిష్కరించాలి

- మంత్రికి నివేదించిన వివిధ జిల్లాల నాయకులు

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్‌ల ను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అసోసియేషన్ నాయకులు వాపోయారు. శనివారం సాయంత్రం కొరిటెపాడులోని ఎల్‌వీఆర్ క్లబ్‌లో డయాగ్నోకాన్-2024 సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్లు మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో ఎక్కడో ఒక కోర్టు తీర్పు ద్వారా ప్రతీ ల్యాబ్‌కు అర్హత పొందిన పెథాలజిస్టు ఉండాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఇక్కడ అమలు చేస్తూ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. దీని వలన గుంటూరు, కాకినాడ, ఏలూరు, వైజాగ్ వంటి జిల్లాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మంది రోడ్డున పడ్డారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పెథాలజిస్టుల ద్వారానే ల్యాబ్ రిపోర్టులు అందించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి రజని స్పందించి తాను ఈ విషయాన్ని సీఎం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇబ్బంది లేకుండా నిర్ణయం తీసుకొంటామని చెప్పారు. అలానే ల్యాబ్ టెక్నీషియన్‌లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సదస్సులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి తాడేకోరు శ్రీహరి, కృష్ణ, శర్మ, బాబ్జి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


మంత్రి రజనికి వినతిపత్రం అందజేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల సంఘాల నాయకులు



ప్రత్యేక హోదా కోసం ఉద్యమం ఉధృతం

- విభజన హామీల సాధన జేఏసీ పిలుపు

గుంటూరు, ఫిబ్రవరి 24: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని పార్టీలతో కలిపి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన విద్యార్థి, యువజన రాష్ట్ర జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో జేఏసీతో పాటు పలువురు నాయకులు మీడియాతో మాట్లాడారు. జేఏసీ కన్వీనర్ షేక్ జిలాని మాట్లాడుతూ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయకుంటే మార్చి ఒకటిన సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఢిల్లీ వేదికగా ఉద్యమాలు చేశామన్నారు. దీనికి ఏపీసీసీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ప్రత్యేక హోదా కోసం జేఏసీ చేసే ఉద్యమానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఛలో సీఎం క్యాంపు కార్యాలయం పేరుతో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, జేఏసీ నాయకులు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్, నూనె పవన్‌తేజ, కోట మాల్యాద్రి, శివారెడ్డి, నారదాసు వీరమణీంద్ర, చైతన్య, నరసింహారావు తదితరులున్నారు.

PUBLIC NOTICE BY ADVOCATE INVESTIGATING TITLE OF THE PROPERTY

NOTICE is hereby given to the public at large that the undersigned Advocate is investigating the title for my client, in respect of the property more particularly described in the schedule hereunder written belonging to Smt. Sajja Krishna Kumari W/o Sajja Venkata Ramana & Smt. Koneru Seethamaha Laxmi W/o Mr. Koneru Venkata Ramaiah, residing at Guntur. All persons having or claiming any right, title, claim, demand or estate interest in respect of the said property or to any part thereof by way of sale, exchange, mortgage, let, lease, lien, charge, maintenance, license, gift, inheritance, share, possession, easement, trust, bequest possession, assignment or encumbrance of whatsoever nature or otherwise are hereby requested to intimatre to the undersigned in writing at the address mentioned below of any such claim accompained with all necessary and supporting documents within 7 days from the date of publication hereof, failing which is shall be presumed that there are no claims and that claims, in any, have been waived off and the undersigned shall p roceed to issue a Title Certificate in respect of the same. **SCHEDULE OF PROPERTY** : All that the Open Plot bearing No 198 in Survey / D.No. 538 total admeasuring Acers 2.78 Cents, admeasuring 345 Square Yards of "Madhura Nagar - 1" Layout approved by UDA under LP No. 1/2002/GNT, File No. RCEI-519/99 situated at Gorantla Municipal Corporation, Guntur Mandal, Guntur District, Andhra Pradesh, under the following boundaries. **East** : Plot No. 199, **West** : 40 Ft Road, **South** : Plot No. 197, **North** : Govt Donka/60 Ft Road.

UMA SHANKAR SITA RAMMA ANJANEYULU, Advocate
A-203, Kushal Towers, Khairatabad, Near Shadan College & Metro Pillar No. A-1188, Hyderabad - 04. 4-405, Vythi's The Town Apartment, Shali Gardena, Yapral, Secunderabad-87. uma.advocate@outlook.in / uma.advocate@gamil.com, Mobile: +91 8008788890

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



సమావేశంలో విక్టరీ చూపుతున్న యరపతినేని శ్రీనివాసరావు, నూతన ఓటర్లు

టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు ఉద్యోగావకాశాలు

● గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 24 : రాష్ట్ర అభివృద్ధికి, ఐటి రంగాన్ని విస్తరింపజేసి లక్షలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలంటే టీడీపీ అధికారంలోకి రావడంతోనే సాధ్యమవుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్లలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మన భవిష్యత్ బాగుండాలంటే బాబు అధికారంలోకి రావడంతోనే సాధ్యమవుతుందన్నారు. యరపతినేని తనయుడు నిఖిల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని లక్షలాది మంది యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు, ఐటి రంగం విస్తరించేందుకు చంద్రబాబే రావాలని కోరారు. పలు మండలాల నుంచి నూతన ఓటర్లు సమావేశానికి హాజరై యరపతినేనితో కలిసి విక్టరీ గుర్తును చూపుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు, పార్టీ నాయకులు పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, నెకరికంటి శివ, శ్రీకాంత్, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఖాశింసైదాతో పాటు పలువురు నూతన ఓటర్లు పాల్గొన్నారు.

పిన్నెల్లి గ్రామస్తులకు అండగా వుంటా

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 24 : గత ఐదేళ్లుగా పిన్నెల్లి గ్రామస్తులు ఎందరో గ్రామం వదిలి వెళ్లినా అధికార పార్టీ నేతలు తమ దోరణి మార్చుకోకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతూనే వుండటాన్ని త్వరలో ముగింపు పలికే విధంగా గ్రామంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత ఐక్యంగా వుండాలన్నారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో శనివారం పిడుగురాళ్లలో సమావేశం నిర్వహించారు. గత ఐదేళ్లుగా పార్టీ నాయకులు గ్రామాలు వదిలి వెళ్లారని, కోర్టు ఉత్తర్వుల మేరకు త్వరలో వారందరినీ గ్రామానికి చేరుస్తామన్నారు. పొలాలు బీళ్లు పడేలా చేయడంతో పాటు మహిళలపై కూడా అత్యాచారాలకు పాల్పడిన వారిని గుర్తు పెట్టుకుంటామన్నారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 24 : రాష్ట్రంలో ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించే విధంగా సంఘీభావం తెలియజేయాలని కోరుతూ యూటీఎఫ్ ఉద్యోగులు గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. రేపటి ప్రజాప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే విధంగా పార్టీ అధిష్టానం వరకు తీసుకెళ్తానని యరపతినేని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నేతలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయసారథి, ఖాశింపీరా, జమాల్, జెవిడి నాయక్, వి.నాగేశ్వరరావు, సాయిబాబు, శ్రీనివాసరావుతో పాటు నరమాల హనుమంతరావు, ప్రసాద్, గోను ప్రసాద్, సత్యనారాయణ, తదితరులున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 24 : స్థానిక ప్రజాశక్తినగర్‌లో ఉన్న కల్యాణ వేంకటేశ్వ రస్వామి దేవాలయంలో శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష హోమం, స్వామివారి కల్యా ణం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ ఘట్టంలో సుమారు 200 మందికిపైగా దంపతులు పాల్గొన్నారు. దేవస్థానం అధ్యక్షులు రామాంజనేయులు, అంబటి హనుమంతరావు, కోటేశ్వరరావుతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సుమారు 4 వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

● కారంపూడి, ఫిబ్రవరి 24: మండలంలోని పెదకొదమగుండ్లలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అన్నదానం జరిపారు.

విశ్వహిందూపరిషత్ మండల ప్రముఖ్‌గా నాగలక్ష్మి

దాచేపల్లి, ఫిబ్రవరి 24 : దాచేపల్లి మండల విశ్వహిందూపరిషత్ మహిళా ప్రముఖ్‌గా మల్లెమార్పు నాగలక్ష్మిని రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నియమించారు. నియామకమైన సహప్రముఖ్‌లను శనివారం తెలియజేస్తూ సహప్రముఖ్‌గా జినుగు అంకమ్మ, సభ్యులుగా మువ్వల దుర్గా మల్లేశ్వరి, వేముల భారతి, మునగా విజయలక్ష్మీ, మునగా పద్మావతి, యర్రమోతు లక్ష్మీ, గంధం శివకుమారి, కొట్టం నాగేంద్రంను నియమించారు. జిల్లా మహిళా ప్రముఖ్ రాజేశ్వరి, హైందవశక్తి సేడింబి ప్రసాద్‌లు కార్యవర్గాన్ని అభినందించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు ఆహ్వానం

దాచేపల్లి, ఫిబ్రవరి 24 : మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అభ్యసించేందుకు ఒకటవ తరగతి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈవోలు రాజకుమారి, పినాకపాణి సంయుక్తంగా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు దారిద్రరేఖకు దిగువగా వున్న ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ, అనాధలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవి బాధిత పిల్లలకు కేటాయించారు. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్ బోధించి ఆయా పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్చి నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వైభవంగా మల్లవోలు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



పూజలలో పాల్గొన్న యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

మాచవరం, ఫిబ్రవరి 24: మండలంలోని మల్లవోలు గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి 32వ కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కల్యాణ మహోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు పొందారు. ఆయన మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధికి అన్నివిధాల సహకరిస్తానని, ఇప్పటికే సుమారు 20 లక్షల రూపాయలతో కల్యాణ మండపాన్ని నిర్మించడం జరిగిందని అన్నారు. పుణ్యదంపతులు కూర్చొని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. యరపతినేని వెంట రామిశెట్టి శ్రీనివాసరావు, కొన్నం రామయ్య, జక్కా వాసు, పాశం మహేష్, గరికపాటి కామేశ్వరరావు, తుమ్మలచెరువు గోపాలరావు, మంగళగిరి కోటేశ్వరరావు, మంగళగిరి శ్రీనివాసరావు, గరికపాటి మోహన్‌రావు, నార్ల ఆంజనేయులు, యడ్లపల్లి రామారావు, చల్లాపల్లి నరసింహారావు, కాశిమళ్ల శౌరిబాబు, షేక్ హసన్‌వలి, కొల్లి కృష్ణమూర్తి, గడిపూడి శ్రీకాంత్, పలు గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పలు గ్రామాలలో శ్రీ లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

మాచవరం, ఫిబ్రవరి 24 : మండలంలోని పలు గ్రామాలలో శని వారం శ్రీ లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మాచవరంతో పాటు వేమవరంలోని తిరుపతమ్మ దేవాలయాల్లో పుణ్యదంపతులు పీటలపై కూర్చొని కల్యాణం నిర్వహించారు. మాచవరంలో, వేమవరంలో మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

21 పోలింగ్ బూత్‌ల పరిశీలన

రెంటచింతల, ఫిబ్రవరి 24 : మండలంలో 50 పోలింగ్ బూత్‌లకు గాను శనివారం వివిధ గ్రామాల్లోని 21 బూత్‌లను పరిశీలించినట్లు తహసీల్దార్ ఎస్.రామమోహనరావు చెప్పారు. మిట్టగుడిపాడు, గోలి, జెట్టిపాలెం, పశర్లపాడు, పాలువాయి, తుమృకోట, కొత్తగంగరాజుపల్లె శివారు గ్రామ పోలింగ్ బూత్‌ను పరిశీలించి సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈయన వెంట ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వోలు పల్లా రామకృష్ణ, జానయ్య, బాలయ్య, ముకూర్, పాపారావు ఉన్నారు.

ఎన్నికల కోడ్ రాగానే ఫ్లెక్సీలు తొలగించాలి

● ఎన్నికల అధికారి పెదప్రోలు శంకరరావు

రెంటచింతల, ఫిబ్రవరి 24 : రానున్న ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి(కోడ్) అమలులోకి రాగానే వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాల్సి ఉంటుందని ఎంపీడీవో, ఎన్నికల నియమ నిబంధనల అమలు అధికారి పెదప్రోలు శంకరరావు చెప్పారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకుల విగ్రహాలను వస్త్రంతో మూసి ఉంచాలని, కరపత్రాలపై ప్రింటింగ్ ప్రెస్ చిరునామా ఉండాలన్నారు. తాగునీటి ట్యాంకర్లపై ఫొటోలుంటే వాటిని కప్పి ఉంచాలన్నారు.

సత్తైనపల్లిలో గెలిచి చంద్రబాబు, పవన్‌లకు గిఫ్ట్ ఇస్తా

● నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను అందజేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఫిబ్రవరి 24 : తనపై నమ్మకం ఉంచి సత్తైనపల్లి నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా సీటు ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇక్కడ గెలిచి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌లకు గిఫ్ట్ ఇస్తానని ఆ పార్టీల అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని కొత్తబోధనం గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కన్నా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండలాధ్యక్షులు తోట నర్స య్య, నియోజకవర్గ నాయకులు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య, మాజీ ఎంపీపీలు గుత్తా వెంకట్రావు, నర్రా బాబురావు, పార్టీ మాజీ అధ్యక్షులు అంచుల నరసింహారావు, పార్లమెంటు కమిటి సభ్యులు అంకాళ్ల ప్రభుదాసు, నాయకులు సానికోమ్ము కొటిరెడ్డి, సర్పంచ్ కణదం శ్రీను, కరిముల్లా, పగడాల శ్రీను ఉన్నారు.

చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌కు కన్నా ధన్యవాదాలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 : సత్తెనపల్లి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు కన్నా లక్ష్మీనారాయణ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు, లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సత్తెనపల్లిలోని తన కార్యాలయంలో శనివారం విలేకరులతో కన్నా మాట్లాడుతూ తనపై నమ్మకంతో సీటు ఇచ్చిన పెద్దల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సత్తెనపల్లి నుంచి గెలిచి వారికి సత్తెనపల్లి సీటును గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. ముప్పాళ్ల మండలం తొండపిలో అంబటి రాంబాబు, ఆయన మనుషులు వైసీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ గొడవలు చేస్తున్నారన్నారు. టీడీపీ జెండా దిమ్మె పడగొట్టిన విషయంపై ముప్పాళ్ల పార్టీ నేతలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కోడెల శివరామ్ గురించి విలేకరులు అడగ్గా కోడెల శివరామ్ టీడీపీ జెండాతోనే కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నాడని, సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించమని చెపుతున్నాడన్నారు.

కన్నాను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం : వడ్డెంపూడి

టీడీపీ, జనసేన పార్టీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను ప్రకటించటం శుభపరిణామమని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ అన్నారు. కన్నాను అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే కన్నా క్యాంపు కార్యాలయానికి పవన్‌కుమార్ వెళ్లి ఆయనను శాలువాతో సత్కరించారు. డాక్టర్ వడ్డెంపూడి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కన్నా విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. కన్నాను కలిసిన వారిలో కొండవీటి జయప్రకాష్, కందేపి నవీన్, కుర్రా మల్లిఖర్జున, దోకిన వంశీ, శశి తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 : పట్టణంలోని 4, 8 వార్డులకు చెందిన వైసీపీ కార్యకర్తలు వేముల కోటేశ్వరరావు, ఖాజావలి, కోటా జార్జ్, వంకాయలపాటి బ్రహ్మం శనివారం రాత్రి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుంటూరు ఆశీర్వాదం, జానకి రామారావు, వెంకటరావు, వసంతరావు ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కారంపూడి, ఫిబ్రవరి 24: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పట్టణ కన్వీనర్ కటికల బాలకృష్ణ, బీసీ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫేస్టో వివరించారు. మాచర్ల అభ్యర్థిగా బ్రహ్మారెడ్డిని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. 20 వేల మెజార్టీతో బ్రహ్మారెడ్డి గెలుపొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, బొర్నేడి హరికృష్ణ, పట్టణ మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జాని, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలు నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాల్వ పేరయ్య, తెలుగుయువత అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండా బూత్‌లెలా మార్చారు : టీడీపీ

గురజాలటౌన్, ఫిబ్రవరి 24 : నియోజకవర్గంలోని 17 బూత్‌లను సమాచారం ఇవ్వకుండా ఎలా మార్చారు.. యథాతథంగా బూత్‌లు ఉంచాలని టీడీపీ నేతలు ఆర్డీవో రమణకాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నేతలతో ఆర్డీవో సమావేశమయ్యారు. టీడీపీ నేతలు మాట్లాడుతూ నియోజకవర్గంలో 17 బూత్‌లను ఏదోక సాకు చూపి మార్చేశారని మండిపడ్డారు. మండలంలోని మాడుగులలో 49 పోలింగ్ బూత్ హైస్కూల్‌లో ఉండగా దాన్ని ఊరి చివరికి మార్చారని, పట్టణంలోని దూబచెరువు వద్ద ఉన్న 32వ బూత్ ప్రభుత్వ పాఠశాలలో ఉందని, ఆ బూత్‌ను హైస్కూల్‌లోకి మార్చారని, దీనిపై కనీస సమాచారం ఇవ్వాలి కదా అని అన్నారు. ఇప్పటికైనా మార్చిన 17 పోలింగ్ బూత్‌లను ఒక్కొటి పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

పది లీటర్ల నాటుసారా స్వాధీనం

వెల్దుర్తి, ఫిబ్రవరి 24: మాచర్ల సెబ్ అధికారులు శనివారం మండలంలోని రచ్చమలపాడులో దాడులు జరిపారు. ఉడతల సావిత్రి 10 లీటర్ల నాటుసారా కలిగి ఉండడాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సావిత్రిని న్యాయాధికారి ఎదుట హాజరుపరుచగా రిమాండ్ విధించినట్లు సెబ్ అధికారులు తెలిపారు.

వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం : పీఆర్కే

విజయపురిసౌత్, ఫిబ్రవరి 24 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానికంగా రూ.5.32 కోట్లతో నూతనంగా నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అలాగే గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.17.5 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్యే పీఆర్కే ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ కెవి చారి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, ఎంపీపీ బూడిద మంగమ్మ, జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరరావు, బూడిద శ్రీనివాసరావు, ఉప ఎంపీపీ పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచ్ వెంకట్రావమ్మ వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీ మల్లుస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్లు తురకా కిషోర్, బోయ రఘురామిరెడ్డి, సర్పంచ్‌లు నోముల కృష్ణ జూకూరి వెంకట్రామయ్య, శ్రీనునాయక్, ప్రాజెక్ట్ ఈఈ శ్రీహరి, డీఈలు వెంకటసుబ్బయ్య, మురళీధర్, ఏఈలు బాబుమియా, లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ మల్లయ్య, మాచర్ల ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఉదయభాను, డాక్టర్ విజయలక్ష్మి, నిరంజన్, రవి, సురేష్, వాణి, మహేష్, కోటేశ్వరరావు, రిటైర్డ్ డీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఆర్కే

● దుర్గి, ఫిబ్రవరి 24: మండలంలోని కోలగుట్లలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రంలను శనివారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం 420 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు, 323 మంది పేద రైతులకు 459 ఎకరాల డీకే పట్టాలను పంపిణీ చేశారు.

బస్సు, లారీ ఢీ : ఇద్దరు డ్రైవర్లకు గాయాలు

మాచర్ల, ఫిబ్రవరి 24: బస్సు, లారీ ఢీకొన్న సంఘటన మాచర్ల పట్టణ శివారులో జరిగింది. శుక్రవారం రాత్రి పొదిలి డిపోకు చెందిన ఇంద్ర బస్సు మాచర్ల నుంచి నెల్లూరుకు బయలుదేరింది. పట్టణ శివారులోని రాయవరం జంక్షన్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మాచర్ల పట్టణం 11వ వార్డుకు చెందిన లారీ డ్రైవర్ బొక్కసం సాంబ కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా దర్శికి చెందిన బస్సు డ్రైవర్ దీరం వెంకటరావు కాలు విరిగిపోయింది. వీరిని స్థానికులు వాహనాల్లో నుంచి బయటకు తీసి మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించారు.

టీడీపీ ఫ్లెక్సీకి నిప్పు

వెల్దుర్తి, ఫిబ్రవరి 24: వెల్దుర్తి మండలం ఉప్పలపాడులో సంక్రాంతి పండుగ సందర్భంగా టీడీపీ నేతలు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. బ్రహ్మారెడ్డికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక వైసీపీ నేతలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కోరారు.

చంద్రబాబుపై అనీల్ కుమార్ విమర్శలు తగదు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి అనీల్ కుమార్ యాదవ్ విమర్శలు చేయటం తగదని టీడీపీ నేతలు అన్నారు. ఎన్‌టీఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ రోజు కూడా చంద్రబాబునాయుడు బీసీలను, యాదవులను తుల నాడుతూ మాట్లాడలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యాదవులకు చేసిందేమి లేదన్నారు. బీసీల అభివృద్ధి తెలుగుదేశం హయాంలోనే జరిగింది. అనీల్ కుమార్ యాదవ్ తప్పుడు వ్యాఖ్యలు చేస్తే రాబోయే ఎన్నికల్లో బీసీ సామాజికవర్గాలు తగిన గుణపాఠం చెబుతాయని నేతలు పీలా సాంబశివరావు, ఎల్.రవి, ఆదాం, సుబ్బారావు, రామయ్య, కోటేశ్వరరావు, నరేష్ అన్నారు.

దొంగను పట్టుకున్న యువకుడు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 : మహిళ మెడలో బంగారపు గొలుసును తెంచుకొని పరారవుతున్న యువకుడిని పట్టణానికి చెందిన యువకుడు పట్టుకున్న సంఘటన శనివారం గార్లపాడు బస్టాండ్ సెంటర్‌లో జరిగింది. ఆ సెంటర్‌లోని అమరావతి డ్రై ఫ్రూట్స్ దుకాణంలో సరుకులు కొనుగోలు చేయటానికి ఓ మహిళ వెళ్ళగా హెల్మెట్ ధరించిన వ్యక్తి ఆ దుకాణంలోకి వెళ్ళి ఆమె మెడలోని బంగారపు గొలుసు తెంచుకొని మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మహిళ బిగ్గరగా కేకలు వేసింది. దీంతో అక్కడే ఉన్న పట్టణానికి చెందిన వల్లెం నరసింహారావు దొంగను గట్టిగా పట్టుకొని కేకలు వేయటంతో ఇరువురి మధ్య పెనుగులాట జరిగింది. నరసింహారావుకు స్థానికులు సహకరించటంతో దొంగను పట్టుకొని పట్టణ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. తెగిపోయిన గొలుసును మహిళకు అప్పగించారు. దీని విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుంది. నరసింహారావును స్థానికులు అభి నందించారు. దొంగకు సంబంధించిన పల్సర్ బైక్‌ను కూడా స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

రామ పుల్లయ్య మృతి బాధాకరం

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 24 : రామ పుల్లయ్య మృతి బాధాకరమని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని లక్కరాజుగార్లపాడుకు చెందిన కొండవీటి రామ పుల్లయ్య మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని శనివారం కన్నా నాగరాజు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఆనం శ్రీకాంత్ అనారోగ్యంతో బాధ పడుతున్న విషయాన్ని తెలుసుకొని శ్రీకాంత్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట గ్రామ టీడీపీ నాయకులు ఉన్నారు.

ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా చదవాలి

పెదకూరపాడు, ఫిబ్రవరి 24 : చిన్న నాటి నుంచే ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా చదవాలని స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ ఉప సంచాలకులు కొర్లకుంట వెంకట సుబ్బారావు అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1981 నుంచి 1986 సంవత్సరం వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సహకారంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో పేద ప్రతిభ కలిగిన విద్యార్థులకు శనివారం స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థి నార్నెపాడు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీరపనేని రమేష్ మాట్లాడుతూ ఆనాడు ప్రభుత్వ పాఠశాలల్లో కలసి చదువుకున్న అందరం కలసి ప్రతి ఏడాది విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపార వేత్త నల్లూరి అప్పాజీ, హెచ్ఎం కాకాని వెంకట రమణ, రాధాకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ వెంకట నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.60 వేల నగదును స్కాలర్‌షిప్‌గా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు అందించారు.

ఘనంగా జగన్నాథస్వామి దేవాలయ వార్షికోత్సవం

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 22 : మండలంలోని చాగంటివారిపాలెంలో ఉన్న సుభద్ర బలభద్ర సహిత శ్రీ జగన్నాథస్వామి పుష్కర కుంభాభిషేక 12వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మూడో రోజు విష్ణు సహస్ర నామ పారాయణం, చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు నిత్య పూజలు, గ్రామ బలిహరణ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు చేపట్టిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. వేడుకలు ఈనెల 26వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు ఏఎస్‌కేవీ రంగారెడ్డి తెలిపారు.

ఓర్వకల్లులో గంగమ్మ అమ్మవారి తిరునాళ్ల

అచ్చంపేట, ఫిబ్రవరి 24 : మండలంలోని ఓర్వకల్లు గ్రామంలో శనివారం గంగమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ తిరునాళ్ళ మహోత్సవంలో ఉదయం 9 గంటలకు ముద్ర పూజలు, జనివాడ చదరంగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్ళు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

టీడీపీ జెండా కట్ చేయడంపై ఫిర్యాదు

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 24 : మండలంలోని తొండపిలో తెలుగుదేశం పార్టీ జెండాను అధికార పార్టీకి చెందిన వారు కట్ చేసి తీసుకెళ్ళారని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మస్తాన్‌వలి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామంలో నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణతో తన స్థలంలో టీడీపీ జెండాను ఆవిష్కరింప చేశామని తెలిపారు. అప్పుడు కన్నా సమక్షంతో పలువురు ముస్లీం కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారని, దీనిని ఓర్చుకోలేని గ్రామంలోని వైసీపీ నాయకులు ఆరుగురు ఈనెల 22వ తేదీ రాత్రి టీడీపీ జెండాను కట్ చేసి తీసుకెళ్ళారని ఫిర్యాదులో తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

తనను గెలిపిస్తే ఐదేళ్లు సేవకుడిగా ఉంటా

● టీడీపీ మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి

మాచర్ల, ఫిబ్రవరి 24 : పార్టీ గెలుపునకు దోహదపడితే ఐదేళ్ల పాటు తాను సేవకుడిగా ఉంటానని టీడీపీ మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పార్టీ అధిష్ఠానం విడుదల చేసిన శాసనసభ అభ్యర్థుల తొలి జాబితాలో బ్రహ్మారెడ్డిని మాచర్ల నియోజకవర్గ అభ్యర్థిగా ఖరారు చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పరిస్థితులు ఇప్పుడే అంచనా వేయలేమని, రాబోయే రెండు నెలలు టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నియోజకవర్గంలో బానిసత్వం, దోపిడీ, అక్రమ కేసుల నుంచి బయటపడాలంటే ఇక్కడ ఖచ్చితంగా గెలిచి తీరాలన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడటం తథ్యమన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మారెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో కొమెర దుర్గారావు, విద్యాధరణి మురళి, గుండాల శ్రీనివాస్ యాదవ్, మాచర్ల వాసు, షేక్ మదార్‌సాహెబ్, పసుపులేటి బ్రహ్మనాయుడు, కొమెర శివ, వజ్రం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మారెడ్డికి అభినందనలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 24: టీడీపీ అధిష్ఠానం విడుదల చేసిన తొలి విడత శాసనసభ అభ్యర్థుల జాబితాలో నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డికి చోటు దక్కటంతో ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వజ్రం నాయక్ హర్షం వ్యక్తం చేస్తూ బ్రహ్మారెడ్డికి అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బ్రహ్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

సైదారావుకు నివాళులర్పించిన బ్రహ్మారెడ్డి

కారంపూడి, ఫిబ్రవరి 24 : మండలంలోని కాకానివారిపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నేత కర్నాటి సైదారావు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బ్రహ్మారెడ్డి గ్రామానికి చేరుకొని సైదారావు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. సైదారావు కుటుంబసభ్యులను పరామర్శించారు.

కన్నా కార్యాలయం వద్ద సందడి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 : సత్తెనపల్లి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా కన్నా లక్ష్మీనారాయణను అధిష్ఠానం అధికారికంగా ప్రకటించటంతో శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. బాణ సంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. నియోజక వర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాల్లో మునిగి పోయారు. స్వీట్లు కూడా పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయానికి వచ్చిన కన్నాను అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కన్నాను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్నారు.

కన్నాకు పలువురు అభినందనలు



కన్నాను సన్మానిస్తున్న కనుమూరి బాజీ చౌదరి

సత్తెనపల్లి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎంపికైన కన్నా లక్ష్మీనారాయణను శనివారం పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల కన్నా కార్యాలయంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు కలసి అభినందనలు తెలియజేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రజలకు నిత్యం సేవ చేసే కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలవటం ఖాయమన్నారు. కన్నాను కలసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, రాష్ట్ర నాయకులు చౌట శ్రీనివాసరావు, ఎలినేడి రామస్వామి, నాయకులు ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, మద్దిరాల గంగాధర్, పిల్లుట్ల సుబ్బారావు, చంద్రగిరి కోటేశ్వరరావు, తోట అంబిక, ప్రత్తిపాటి హరేకృష్ణ, గోగినేని కోటేశ్వరరావు, రావిపాటి మధుబాబు, చిన అబ్దుల్ నబీ, రాంబో బుడే, దూదెకే, సయ్యద్ మాబూ, ఆతుకూరి నాగేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

కన్నాకు టీడీపీ సీటు ప్రకటించడంపై హర్షం

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 24 : సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను ప్రకటించడంపై శనివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాజకీయంగా అనుభవమున్న కన్నాను సత్తెనపల్లి నుంచి గెలిపించి అసెంబ్లీకి పంపిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు రావిపాటి మధుబాబు, గంగారాం కాశిం, పఠాన్ లీలాఫర్, అత్తోట వెంకటకృష్ణ, కందుల మనోజ్, డబ్బుకొట్టు వెంకట నారాయణ, మాభు సుభానీ, క్రిష్టిపాటి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు తడులకు సాగు నీరు అందించ లేని అసమర్థ వైసీపీ ప్రభుత్వం

● ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గాదె వెంకటేశ్వరరావు

పెదకూరపాడు, ఫిబ్రవరి 24 : ఆరు తడులకు సాగు నీరు అందించ లేని అసమర్థ ప్రభుత్వం వైసీపీ అని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. పెదకూరపాడులో జనసేన మండల పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ నేతలు ప్రకృతి సంపదైన ఇసుకను కొల్లగొట్టి కోట్లు గడిస్తున్నారన్నారు. మిత్రపక్షం తెలుగుదేశం పార్టీతో జన సైనికులు సమన్వయం చేసుకొని ప్రజల్లోకి వెళ్ళి జగన్ మాయను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ చిట్టాబాలు, జనసేన పార్టీ మండల కన్వీనర్ మల్లెల వెంకట చలపతిరావు, నియోజకవర్గ సమన్వయ కర్త యర్రంశెట్టి రామకృష్ణ, కందుల కృష్ణకాంత్, శౌరీలు, బుచ్చిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మండల టీడీపీ నేతలు మక్కెన సాగర్, షేక్ అజ్మల్లా, వెల్లలచెరువు సురేష్, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా మండలంలోని కాశిపాడు నుంచి పొడవాడు వరకు జనసేన నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ముస్సాపురం, లింగంగుంట్ల గ్రామాల్లో జనసేన జెండాలను ఆవిష్కరించారు.

పెదకూరపాడులో విజయం తెలుగుదేశానికే : గడ్డిపర్తి

బెల్లంకొండ, ఫిబ్రవరి 24 : పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం సీటు ఆలస్యంగా ప్రకటించినా విజయం మాత్రం తమదేనని మండల దళిత నాయకుడు గడ్డిపర్తి సముద్రం అన్నారు. బెల్లంకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ సోషల్ మీడియా పెదకూరపాడు సీటుపై అనవసరంగా దుష్ప్రచారం చేస్తుందని ఖండించారు. పార్టీ నిర్ణయమే టీడీపీ నాయకులు శిరసా వహిస్తామని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్-6 పథకాలు, తెలుగుదేశం ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమలను ప్రజల్లోకి తీసుకు వెళ్తామని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు ఓటమిని అంగీకరించే సోషల్ మీడియాలో అనవసరంగా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, తెలుగు యువత నాయకులు సలాం, ఓర్సు రాంబాబు, గుడిసె కొండయ్య, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ ఈఏపీసెట్ నోటిఫికేషన్

దిక్సూచి

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఈఏపీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయుహెచ్) నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సులు

- బీఈ, బీటెక్; బీటెక్(బయోటెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ); బీఫార్మసీ; బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/హార్టికల్చర్); బీఎస్సీ ఫారెస్ట్రీ; బీవీఎస్సీ అండ్ ఏహెచ్; బీఎఫ్ఎస్సీ
- ఫార్మా-డీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ)
- బీఎస్సీ నర్సింగ్

అర్హత: అభ్యర్థులు చేరదలచుకున్న కోర్సును అనుసరించి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.



టీఎస్ ఈఏపీసెట్ 2024 వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్ అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు; ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్ అభ్యర్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు ప్రక్రియ:** ఫిబ్రవరి 26 నుంచి
- **ఏదేని ఒక స్ట్రీమ్‌నకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **రెండు స్ట్రీమ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 6
- **టీఎస్ ఈఏపీసెట్ 2024 తేదీలు:** ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్‌కు మే 9, 10; అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్‌కు మే 11, 12
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్(నాలుగు జోన్‌లు), నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు.
- **వెబ్‌సైట్:** eapcet.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PWo1UkFలో చదవండి.

హాలియాలో విశ్వంభర చిత్రీకరణ





వశిష్ఠ దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా షూటింగ్ శనివారం నల్లగొండ జిల్లా హాలియాలోని వజ్రతేజ రైస్ ఇండస్ట్రీలో జరిగింది. పలు సన్నివేశాలు చిత్రీకరించారు. చిరంజీవితో పాటు నటులు రాజారవీంద్ర, హర్షవర్ధన్, వెన్నెల కిశోర్, చమ్మక్ చంద్ర, ప్రవీణ్, రోహన్, అకుల్, కుసుం చిత్రీకరణలో పాల్గొన్నారు. హాస్యనటులు, చిరంజీవికి మధ్య పలు సన్నివేశాలను చిత్రీకరించారు. వజ్రతేజ రైస్‌మిల్‌లో విశ్వంభర షూటింగ్ గురించి తెలుసుకున్న చిరంజీవి అభిమానులు, స్థానికులు ఉదయం నుంచే రైస్‌మిల్ వద్దకు భారీగా తరలివచ్చారు. హాలియా సీఐ రాఘవరావు అధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి షూటింగ్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు.

మే 9నే కల్కి రాక

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మే 9న ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ఈ సినిమా విడుదల వాయిదా పడనుందంటూ డిజిటల్ మీడియాలో వస్తున్న వదంతులపై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ స్పందించింది. ముందు ప్రకటించినట్లు మే 9న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు స్పష్టం చేశారు. నేపథ్యంలో వినిపిస్తున్న



సంగీతానికి అనుగుణంగా ప్రభాస్ పాదం కదుపుతున్న వీడియోను శనివారం మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు.

భిన్నమైన పాత్రల్లో భీమా

గోపీచంద్ కథానాయకుడిగా ఏ. హర్ష దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. కేకే రాధామోహన్ నిర్మించారు. మార్చి 8న విడుదలవుతోంది. శనివారం



చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. గోపీచంద్ రెండు విభిన్నమైన పాత్రల్లో ఆకట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు హర్ష కథను అద్భుతంగా తెరపైకి తెచ్చాడు. రవి బస్రూర్ బ్యాగ్రౌండ్ స్కోర్ ఇరగదీశాడు. ప్రేక్షకులు ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. యాక్షన్‌తో పాటు కామెడీ, ఎంటర్టైన్‌మెంట్ చాలా గొప్పగా ఉంటుందని హర్ష తెలిపారు.

శనివారం సూర్య వేట



నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న విడుదలవుతోంది. శనివారం నాని పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. సూర్య అనే పాత్రలో నాని స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఆయన పాత్రను మలచిన తీరు సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక.

సుజీత్ దర్శకత్వంలో

అలాగే నాని నటించే తదుపరి చిత్రాన్ని పుట్టిన రోజు సందర్భంగా ప్రకటించారు. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మాత. 2025లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇతర వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

బహుముఖం ఉత్కంఠభరితం



హర్షివ్ కార్తిక్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. ఈ చిత్రం టీజర్‌ను శనివారం దర్శకుడు శశి కిరణ్ తిక్క చేతుల మీదుగా విడుదల చేశారు. 'టీజర్ బాగుంది. విజువల్స్‌తో పాటు సౌండ్‌కి చాలా ప్రాధాన్యత ఇచ్చారు. శ్రీచరణ్ బీజీఎం అదరగొట్టారు' అని ఆయన చిత్రబృందాన్ని ప్రశంసించారు. ఊహించని మలుపులతో కథ ఉత్కంఠభరితంగా సాగుతుందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. చాలా ప్రేమతో, కష్టంతో చేసిన సినిమా ఇది, ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉందని హర్షివ్ కార్తిక్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఫణి కల్యాణ్. బ్యాగ్రౌండ్ స్కోర్: శ్రీచరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: ల్యూక్ ఫ్లెచర్



మాట్లాడుతున్న ప్రాసిక్యూషన్ డీడీ మధుసూదనరావు, శిక్షణకు హాజరైన పోలీసు అధికారులు

ఎన్నికల నిబంధనలపై పోలీసు అధికారులకు అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 24: పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నిబంధనలపై తీసుకోవాల్సిన చర్యలు, వివిధ చట్టాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ నిపుణులు, సీనియర్ పోలీసు అధికారులు ఎన్నికలకు సంబంధించి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు, నరసింహారావు, కరిముల్లా షావలి, ఏపీ బ్రహ్మం, ఏ అశోక్ కుమార్, వెంకటరెడ్డి, వీరాంజనేయులు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీదే విజయం

టీడీపీ ఇన్‌చార్జ్ అరవింద బాబు

రొంపిచర్ల, ఫిబ్రవరి 24: రాబోయే ఎన్నికల్లో టీడీపీదే విజయమని ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. శనివారం మండలంలోని రొంపిచర్ల శివాలయం కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, కడియాల లలితసాగర్, అట్ల చిన వెంకటరెడ్డిలతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. రాష్ట్రంలో జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించబోతున్నారని పేర్కొన్నారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ 120మంది అభ్యర్థులను ప్రకటించిన ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, కల్లి మల్లారెడ్డి, పల్లెల నాగిరెడ్డి, పెద్దినీడి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

27న వైద్య ఆరోగ్య శాఖ గ్రీవెన్స్ డే

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 24: ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ పద్మావతి ఆదేశాల మేరకు ఈనెల 27న గ్రీవెన్స్‌డేను నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ బీ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలో పని చేసే వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల్లో ఎవరికైనా జీతాలకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లయితే వారు డీఎంహెచ్‌వోను వ్యక్తిగతంగా కలసి వినతి పత్రాలు అందజేయాలని ఆయన సూచించారు.

లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలి

నరసరావుపేట అర్బన్, ఫిబ్రవరి 24 : పల్నాడు జిల్లాలోని దుకాణాలు, వాణిజ్య సంస్థల యజమానులు ఈనెల 29 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ జీ ధనలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థలు చట్టం 1988 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఉద్యోగులు కలిగిన, లేని సొంత వ్యాపార దుకాణాలు, సంస్థలు ఈ లైసెన్స్ పొందాలన్నారు. సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

రొంపిచర్ల, ఫిబ్రవరి 24: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఉచిత విద్యను అభ్యసించటానికి 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవో బ్రహ్మేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అనాధలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలకు కేటాయించబడ్డాయి. స్టేట్, సీబీఎస్‌సీ, ఐబీ సిలబస్ బోధించే తమ సమీప పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం చదవటానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి మార్చి 14వ తేదీ లోపు విద్యార్థులు ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఫొటోలతో సమీపంలోని సచివాలయ, నెట్ సెంటర్, ఎంఈవో కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు టోల్ ఫ్రీ నెంబరు 18004258599, 94932 41348 నెంబర్లను సంప్రదించాలని ఎంఈవో తెలిపారు.

నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో డాక్టర్ పుట్టా రమణయ్య

యడ్లపాడు, ఫిబ్రవరి 24: మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో మార్చి ఆఖరునాటికి ఇంటి పన్నుల వసూళ్ళు నూరుశాతం పూర్తిచేయాలని నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారి డాక్టర్ పుట్టా రమణయ్య ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, సిబ్బందితో పన్నుల వసూళ్ళపై సమీక్ష నిర్వహించారు. ముందుగా ఇంటిపన్ను వసూళ్ళపై ఈవోపీఆర్డీ వరూధినిని ఆరా తీశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 18 గ్రామపంచాయతీలలో రూ.1.46కోట్ల డిమాండ్ ఉందని, వాటిలో సుమారు 39శాతం రూ.97.90లక్షలు వసూలైందని డీఎల్‌పీవోకి తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరం 15వ ఆర్థిక సంఘం నుంచి పంచాయతీలకు విడుదలైన నిధులు, 2023-24 సంవత్సరానికి విడుదల కానున్న నిధులకు సంబంధించి ఆయా సంవత్సరాలకు జీపీడీపీ సప్లిమెంటరీ ప్రణాళికలు రూపొందించాలన్నారు. టైడ్ కింద 60శాతం, అన్‌టైడ్ కింద 40శాతం కేటాయింపులతో ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆయా కార్యక్రమాల రూపకల్పనపై పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు : ప్రత్తిపాటి



ప్రార్థన చేస్తున్న గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య, పాల్గొన్న ప్రత్తిపాటి

యడ్లపాడు, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే క్రైస్తవుల సంక్షేమం, వారి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడు ఎర్రకొండ వద్దగల రహదారిమాత పుణ్యక్షేత్రం ద్వితీయ వార్షికోత్సవ ముగింపు వేడుకలలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. పుణ్యక్షేత్ర విచారణ గురువు బాల సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని బాగ్యయ్య ముఖ్యఅతిధిగా సందేశమిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, విశ్వాసులు పాల్గొన్నారు.

వైభవంగా కొండగురునాథ స్వామి తిరునాళ్ళ

నూజెండ్ల, ఫిబ్రవరి 24: రవ్వవరం శ్రీకొండగురునాథ స్వామి తిరునాళ్ళ శనివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రాముడుపాలెం, వేముల, బుర్రిపాలెం, దేవారం గ్రామాలకు చెందిన భక్తులు ఆరు భారీ విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావులు దేవాలయం, మెట్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినుకొండ, వినుకొండ రూరల్ సీఐలు పీ సాంబశివరావు, యూ సుధాకర్‌బాబు, ఐనవోలు ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణరెడ్డిలతో పాటు మరో ఐదుగురు ఎస్‌ఐలు, వందమంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి, వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి యాదవ్, గంధం బాలిరెడ్డి, ఒంగూరి ప్రసాదు, టీడీపీ నాయకులు బచ్చు అంజిరెడ్డి, మరిడి సురేష్, బొట్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవీకి సీటు.. టీడీపీలో మక్కెన..

శ్రేణుల్లో నూతనోత్సాహం

● వినుకొండలో ఊపందుకున్న రాజకీయం
● వైసీపీ శ్రేణుల్లో అలజడి



తమ నాయకుల ఫ్లెక్సీలతో అభిమానం చాటుకుంటున్న అభిమానులు

వినుకొండ, ఫిబ్రవరి 24: ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుతో పాటు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు త్వరలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్న నేపథ్యంలో మక్కెన అనుయాయులతో పాటు టీడీపీ నాయకులు పట్టణంలో పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. మక్కెన టీడీపీలో చేరనున్న నేపథ్యంలో ఆయన వర్గంలో ఆనందానికి అవధులు లేవు. మక్కెన వర్గంతోపాటు జీవీ వర్గీయులు కలిసి వ్యూహాలకు పదునుపెట్టి గెలుపే ధ్యేయంగా అడుగులు ముందుకేస్తున్నారు. దీంతో వినుకొండలోని వైసీపీ శ్రేణుల్లో వణుకుమొదలైనట్లు అయింది. బొల్లా నోటి దురుసు, మరొకరి నాయకత్వం సహించకపోవడం, ప్రత్యర్థి లావాదేవీలపై దెబ్బకొట్టడం, కార్యకర్తలను పరుషపదాలతో దూషించడంతో వైసీపీ శ్రేణుల్లో అలజడి మొదలైంది. బొల్లా వ్యవహార శైలిపై ఇప్పటికే ఆ పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకులు పార్టీ జెండాలు పక్కనపెట్టి సొంత వ్యాపారాలపై నిమగ్నమయ్యారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు రూపంలో టీడీపీలోకి వలసలు ఊపందుకోవడంలో జీవీ శిబిరంలో ఆనందానికి అవధులు లేవు. టీడీపీలోని జీవీ గెలుపుకు అటు జనసేన, ఇటు మాజీ ఎమ్మెల్యే మక్కెన వర్గం తోడవడంతో ఇప్పటికే వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు సైతం గుట్టుచప్పుడు కాకుండా చర్చలు జరిపి గెలుపుకు సహకరిస్తామని మాట ఇచ్చినట్లు సమాచారం. స్తబ్దుగా ఉన్న నేతలు సైతం స్వచ్ఛందంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి జీవీ ఆంజనేయులుకు జై కొడుతూ అభిమానం చాటుకుంటున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శనివారం జీవీకి సీటు కేటాయించడంతో పాటు ఈ నెల 26న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, జంగా, మక్కెన టీడీపీ తీర్థం పుచ్చుకోనుండటంతో టీడీపీ సానుభూతి పరుల్లో పండుగ వాతావరణం నెలకొని ఉంది.

జీవీకి మొదటి విడతలో సీటుపై హర్షం

వినుకొండ, ఫిబ్రవరి 24: టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కలిసి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వినుకొండ టీడీపీ అభ్యర్థిగా జీవీ ఆంజనేయులును ప్రకటించడంపై ఆ పార్టీ శ్రేణులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. మొదటిజాబితాలోనే జీవీ పేరును ప్రకటించడంతో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి జీవీని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి షమీమ్‌ఖాన్, మీసాల మురళీకృష్ణయాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, ముండ్రు సుబ్బారావు, సౌదాగర్ జానీబాషా, గోనుగుంట్ల హనుమంతరావు, గడిపూడి విశ్వనాథం, మద్దుల వెంకటేశ్వరరెడ్డి, రొడ్డా వీరాంజనేయరెడ్డి, పాలెపోగు బాలగురవయ్య, రావుల మల్లేశ్వరరావు, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, సుంకర శ్రీను, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట ప్రజలకు, టీడీపీకి జీవితం పునరంకితం

మాజీ మంత్రి ప్రత్తిపాటి



బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేస్తున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 24: తన జీవితం చిలకలూరిపేట ప్రజలు, తెలుగుదేశం పార్టీ సేవలకే పునరంకితమని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గం నుంచే తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించటం స్థానిక ప్రజలకు మరింత సేవచేయటానికి లభించిన అవకాశంగా భావిస్తున్నానన్నారు. శనివారం టీడీపీ అధిష్టానం ప్రకటించిన మొదటి జాబితాలో ప్రత్తిపాటిని అధికారికంగా చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థిగా ప్రకటించటంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పార్టీ కార్యాలయం వద్ద, ఎన్ఆర్‌టీ సెంటర్‌లో, ప్రత్తిపాటి నివాసం వద్ద భారీఎత్తున బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ తనకు 6వ సారి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం కల్పించిన చంద్రబాబు, లోకేశ్, అచ్చన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కూడా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు.

శిలాఫలకాలపై గ్రామసర్పంచ్‌లకు దక్కని చోటు

శావల్యాపురం, ఫిబ్రవరి 23: గ్రామాలలో నిర్మించిన సచివాలయాలు, రైతుభరోసాకేంద్రాలు, విలేజ్‌హెల్త్‌క్లినిక్‌ల ప్రారంభోత్సవాలకు ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై ఆయా కార్యాలయాల పరిధిలోని గ్రామసర్పంచ్‌ల పేర్లు ముద్రించకుండా అధికారులు నిర్లక్ష్యధోరణితో వ్యవహరించారని వయ్యకల్లు, ఇర్లపాడు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 15గ్రామపంచాయతీలలో ప్రభుత్వం 11 సచివాలయాలు, 11ఆర్బీకేలు, 11 విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను నిర్మించింది. ఇర్లపాడు పంచాయతీని పోట్లూరు సచివాలయం పరిధిలోకి, బొందిలిపాలెం పంచాయతీని మతుకుమల్లి సచివాలయం పరిధిలోకి, వయ్యకల్లు పంచాయతీని గుంటుపాలెం సచివాలయం పరిధిలోకి, చిన్నకంచెర్ల పంచాయతీని పిచికలపాలెం సచివాలయం పరిధిలోకి తెచ్చిందన్నారు. రెండు గ్రామాలను ఒకటే సచివాలయం కిందకు తెచ్చినపుడు ఇరుగ్రామాల సర్పంచ్‌లను ఒకేవిధంగా చూడకుండా సచివాలయాలున్న గ్రామాల సర్పంచ్‌లను మాత్రమే సమావేశాలకు ఆహ్వానిస్తున్నారని, ప్రారంభోత్సవాల శిలాఫలకాలపై కూడా అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా సచివాలయమున్న గ్రామసర్పంచ్ పేరును మాత్రమే ముద్రించారని, కనీసం ప్రారంభోత్సవాలకు తమకు ఆహ్వానం కూడా అందలేదని వాపోయారు. ప్రతిపక్ష పార్టీలకు చెందినవారిమనే అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కోరారు.

అభివృద్ధి జరగాలంటే వజ్రాయుధం లాంటి ఓటును వినియోగించుకోవాలి

టీడీపీ యువనేత డాక్టర్ కడియాల లలిత్‌సాగర్



మాట్లాడుతున్న టీడీపీ యువనాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, కనుమూరి లక్ష్మి తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో కంపెనీలు, అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే వజ్రాయుధం వంటి మీ మొదటి ఓటును వినియోగించుకోవాలని టీడీపీ యువనేత డాక్టర్ లలిత్‌సాగర్ అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కాలేజీలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో 18 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉన్న యువత 25 వేల మంది ఉన్నారని అన్నారు. యువత ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా రాష్ట్ర భవిష్యత్ మారుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రాయల శ్రీనివాసరావు, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు కుమ్మేత కోటిరెడ్డి, పోనుగోటి శ్రీనివాసరావు, కనుమూరి లక్ష్మి, ముచ్చు వీరయ్య, భాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవం




వినుకొండ: కల్యాణ మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న మక్కెన

వినుకొండటౌన్, ఫిబ్రవరి 24 : మండలంలోని కంచర్ల గ్రామంలో లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణమహోత్సవాన్ని గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు గిరిబాబు, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నగుర్నాథం, రెడ్డి వెంకటరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, రామిరెడ్డిపాలెం గ్రామాల్లో వేంచేసి ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ తల్లి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పూజలను అర్చకులు నిర్వహించారు. రొంపిచర్లలోని బొడ్డురాయి సమీపంలో వేంచేసి ఉన్న ఆలయంలో జరిగిన కల్యాణోత్సవంలో దంపతులు పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి, అంకమ్మ తల్లి, వినాయకుడు, నాగేంద్రస్వామి, గరుత్మంతుడు, పోతురాజు, గోమాత విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో జరిగిన కల్యాణోత్సవాలను భక్తులు తిలకించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

● నాదెండ్ల: మండలంలోని సంక్రాంతిపాడు, ఎండుగుంపాలెం గ్రామాల్లో దేవతా మూర్తుల కల్యాణాలు శనివారం వైభవంగా జరిగాయి. సంక్రాంతిపాడు గ్రామంలో గోపయ్య, సమేత లక్ష్మీతిరుపతమ్మ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పలు జంటలు పాల్గొని పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా ఎండుగుంపాలెంలో శ్రీగంగాపార్వతి సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామునుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలను నిర్వహించారు. దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



ప్రజాపోరు కార్యక్రమంలో మాట్లాడుతున్న మేడం రమేష్

వినుకొండటౌన్, ఫిబ్రవరి 24: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి 29 వరకు నియోజకవర్గంలో జరుగుతున్న ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ మేడం రమేష్, గొడవర్తి సుజాత, గుడివాడ చంద్రశేఖర్, పేరయ్య, శ్రీనివాసరావు, రాజు, జాన్‌బాబు, సుబ్బారావు, గణేష్, కోటా సుధాకర్, లక్ష్మీనారాయణ, గర్రె అనిల్, జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ, మాజేటి ప్రవీణ్, కూరపాటి వెంకట నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శివశక్తి ఫౌండేషన్ నిధులతో చప్టాకు మరమ్మతులు



చప్టాపై గోతులను పూడ్చిస్తున్న టీడీపీ కౌన్సిలర్ అంజలీదేవి, పార్టీ నాయకులు

వినుకొండ, ఫిబ్రవరి 24: వార్డుల్లో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పట్టణంలోని 5వ వార్డు టీడీపీ కౌన్సిలర్ పోలూరి అంజలీదేవి శనివారం తెలిపారు. నెల రోజుల క్రితం విద్యానగర్ నుంచి ఎన్ఎస్‌పీ కాలనీకి వచ్చే ప్రధానరహదారిపై అధికారులు బాగున్న చప్టాకు మరమ్మతుల్లో భాగంగా గుంతలు తీశారు. మున్సిపాలిటీ అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు సఖ్యత కుదరక మరమ్మతులు నిర్వహించేందుకు అధికారు లు నిరాకరించారు. గమనించి టీడీపీ కౌన్సిలర్ పోలూరి అంజలీదేవి సూచన మేరకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ సహకారంతో చప్టాకు మరమ్మతులు నిర్వహించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణ, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పీవీ సురేష్, బూత్ కన్వీనర్ పమిడి మర్రి శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు బైసాని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలలో ప్రభుత్వ మద్దతు ధరకు

కందుల కొనుగోలు

శానంపూడిలో కందులు కొనుగోలు చేస్తున్న ఎంపీవో ప్రవీణ్



శావల్యాపురం, ఫిబ్రవరి 24: మండలంలోని అన్ని రైతుభరోసాకేంద్రాలలో ప్రభుత్వ మద్దతుధరకు కందులు కొనుగోలు చేస్తున్నట్లు ఎంఏవో పల్లపోతు ప్రవీణ్ అన్నారు. మండలంలోని శానంపూడి గ్రామంలో 20.5 క్వింటాళ్ళ కందులను నాఫెడ్ ధర రూ.9754కు శనివారం కొనుగోలు చేశారు. ఎంఏవో మాట్లాడుతూ నాఫెడ్ ధరలో జీఎస్‌టీ రూ.74 కూడా కలపి ధరను నిర్ణయించడం జరుగుతుందన్నారు. గోనెసంచులు, కాటా కూలీలు, రవాణా చార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుందని, రైతులు ఏర్పాటుచేసుకొంటే వాటిని కూడా కందులు నగదుతో పాటు 4రోజుల వ్యవధిలో రైతుల బ్యాంక్ ఖాతాలకు జమచేస్తుందన్నారు. రైతులు కందులలో 12శాతం తేమకు మించకుండా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. వీఏఏ ఇర్మియా, రైతులు పాల్గొన్నారు.

27 నుంచి పల్నాడు జిల్లాలో

రెండు సెక్షన్లుగా ఏపీ టెట్-2024

పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 24: పల్నాడు జిల్లాలో 27వ తేదీ నుంచి మార్చి 6 వరకు ఏపీ టెట్-2024 పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్లుగా జరుగుతాయని డీఈవో ఎం వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 7180 మంది అభ్యర్థులు హాజరవుతారని, ఐదు పరీక్షా కేంద్రాలలో నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించటానికి ప్రతి కేంద్రంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు. యల్లమందలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజ్, నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, కేసానుపల్లిలోని కృష్ణవేణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల, జొన్నలగడ్డలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఏపీ టెట్-2024 పరీక్షలపై అభ్యర్థులకు ఆదనపు సమాచారం కోసం నరసరావుపేట జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ సెల్‌లో ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 వరకు సంప్రదించవచ్చన్నారు. ఏపీవో జీ జీవరత్నం, 98669 04960, ఏపీవో పీ శంకర్‌రాజు 99631 92487 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

పల్నాడు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం నీలావతిదేవి



మాట్లాడుతున్న డీఐఈవో ఎం నీలావతిదేవి, ప్రత్యేక అధికారి టీ శేఖర్‌బాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 24: ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి జరుగుతాయని పల్నాడు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం నీలావతిదేవి అన్నారు. శనివారం స్థానిక కేఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని డీఐఈవో కార్యాలయంలో సీఎస్, డీవోలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎం నీలావతిదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రశాంతవాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జిల్లా ప్రత్యేక అధికారి టీ శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారికి కేటాయించిన పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈసీ సభ్యుడు నర్సయ్య, శ్రీనివాస్, కేఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం గోపాలకృష్ణ, జిల్లాలోని సీఎస్‌లు, డీవోలు పాల్గొన్నారు.

సీఆర్ క్లబ్‌లో టెన్నిస్ పోటీలు ప్రారంభం



టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న చెరుకూరి కాంతయ్య

చిలకలూరిపేట, ఫిబ్రవరి 24: పట్టణంలోని సీఆర్ క్లబ్‌లో టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నాలుగు జిల్లాల స్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య ప్రారంభించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి మొత్తం 50 టీమ్‌లు పోటీల్లో పాల్గొంటున్నాయి. రెండురోజులపాటు జరిగే ఈ పోటీలు ఆదివారం రాత్రి ముగుస్తాయి. పోటీల ప్రారంభ కార్యక్రమంలో కే వంశీ, డాక్టర్ సీహెచ్ రత్తయ్య చౌదరి, డాక్టర్ లావు సతీష్, పెరవలి కోటిరావు, సాధినేని హనుమంతరావు, డాక్టర్ మక్కెన వంశీ, డీ రమేష్, రాజీవ్, కాళహస్తి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్ర ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం

వినుకొండ, ఫిబ్రవరి 24: పట్టణంలోని పాతమార్కెట్‌యార్డు వద్దగల చలివేంద్ర ఆంజనేయస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మూడురోజుల పాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి విశేష అభిషేకాలు, హోమాలు, స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం దేవాలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కల్లంలో ఆరబోసిన మిర్చి అపహరణ

వినుకొండటౌన్, ఫిబ్రవరి 24: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల గుడ్‌షపర్డ్ స్కూల్ వెనుకవైపు కల్లంలో ఆరబోసిన 3 ఎకరాల మిర్చి పంటలో సుమారు 5 క్వింటాళ్ల గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు రైతు నకరికంటి చిన్నఖాశీం శనివారం తెలిపారు. అపహరించిన మిర్చి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. సుమారు 12క్వింటాళ్ల మిరప కాయలను కల్లంలో ఆరబోశాడు. భోజనానికని ఇంటికి వెళ్లిన సమయంలో మిర్చిని దొంగిలించినట్లు ఆయన గుర్తించారు. సమాచారం తెలుసుకున్న రైతుసంఘం నాయకులు ఉలవలపూడి రాము, కంచర్ల శ్రీను, పేర్లపాడు సుభాని, షేక్ బాషా, ఎస్. అంజి సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వర్తక వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశం

వినుకొండ, ఫిబ్రవరి 24 : పట్టణంలోని వ్యాపార సంస్థలు తప్పనిసరిగా తమ లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోవాలని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ గాయత్రీదేవి తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలోని కార్మిక శాఖ కార్యాలయంలో వివిధ అసోసియేషన్‌ల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ అధికారులు మాట్లాడుతూ వ్యాపారసంస్థలు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని, గతంలో లైసెన్స్‌లు పొందిన వారు రెన్యువల్ చేయించుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఆమెతో పాటు వినుకొండ కార్మిక శాఖ అధికారి కిలారి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

బొల్లాపల్లి, ఫిబ్రవరి 24: మండలంలోని బొల్లాపల్లిలో టీడీపీ, జనసేన ఉమ్మడి ఎన్నికల కార్యాలయాన్ని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నేతలు ఉమ్మడిగా, క్రమశిక్షణగా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని జీవీ కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 25 కుటుంబాలు

వినుకొండటౌన్, ఫిబ్రవరి24: మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలోని వైసీపీకి చెందిన 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు సమక్షంలో శనివారం పార్టీ కండువాలు వేసుకున్నారు. పార్టీలో చేరినవారిలో మాజీ సొసైటీ అధ్యక్షుడు చింతా ఆదిరెడ్డి, చింతా బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి, వెంకటరెడ్డి, హసనాయునిపాలెంకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు తిరుమల వెంకటేశ్వర్లు, గడాల హనుమంతు, ఎద్దు గోపి, తిరుమల ఏడుకొండలు,నాగిరెడ్డి, వెంకటరెడ్డి, యారగుంట్ల పెదమాణిక్యాలరావు, బూదోట నాసరయ్యలు ఉన్నారు.

విద్యార్థులకు సైకిళ్ళ పంపిణీ

బొల్లాపల్లి, ఫిబ్రవరి 24: బొల్లాపల్లి అసిస్ట్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హైస్కూల్‌లో చదివే 20మంది విద్యార్థినిలకు శనివారం సైకిళ్ళను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ విద్యార్థినిలకు సైకిళ్ళు పంపిణీచేయటం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో అసిస్ట్ కో-ఆర్డినేటర్ ఏ శ్రీనివాసరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, గోవిందు నాయక్, దాసయ్య, రంగయ్య, హనుమానాయక్, పీ సురేష్ తదితరులు ఉన్నారు.



సైకిళ్ళను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ